



ధర్మారంలోని ఓ రైతు పొలంలో నీరు పడకపోవడంతో పూడ్చిన బోరు

రూ.2లక్షల రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే

- మారుతున్న కాలానుగుణంగా వాణిజ్య పంటలు సాగుచేయాలి
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం

అక్కన్నపేట, ఆగస్టు 10: ప్రస్తుత తరుణంలో మారుతున్న కాలానుగుణంగా వాణిజ్య పంటలను సాగుచేయాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సూచించారు. శనివారం అక్కన్నపేట మండలంలోని రామవరం, మల్లంపల్లి రైతువేదికల్లో వ్యవసాయ అనుబంధ రంగాల పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడారు. రైతులందరూ అధిక ఆదాయం పొందేందుకు వాణిజ్య పంటలు సాగుచేయాలని సూచించారు. ఏ రాష్ట్రంలో కూడా రూ.2లక్షల రుణమాఫీ చేయలేదని, ఒక్క తెలంగాణలో మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షలు మాఫీ చేసిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.1.50 లక్షల వరకు మాఫీ జరిగిందని, మరో వారం రోజుల్లో రూ.2లక్షల వరకు మాఫీ జరుగుతుందని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ.431.50 కోట్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. త్వరలోనే గౌరవెల్లి ద్వారా నీటిని అందించి రైతులు ముఖాల్లో ఆనందం చూడాలన్నదే తన లక్ష్యమని ఆయన వివరించారు. హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, ఎంపీడీవో బానోతు జయరాం, తహసీల్దార్ ఉట్కూరి అనంతరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

ఇళ్ల పరిహారం ఎప్పుడిస్తారు

గండిపల్లి రిజర్వాయర్ కోసం భూసేకరణ చేసిన అధికారులు వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించినా.. ఇళ్ల స్థలాలకు, ఇళ్లకు పరిహారం ఇవ్వలేదని అక్కన్నపేట మండలంలోని గండిపల్లి రిజర్వాయర్ ముంపు బాధితులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. రామవరంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన మంత్రిని పలువురు ముంపు బాధితులు కలిశారు. 15 ఏళ్ల క్రితం రిజర్వాయర్ కోసం తమ భూములు తీసుకున్నారని, అప్పట్లో వ్యవసాయ భూములకు ఎకరానికి రూ.2.10 లక్షల చొప్పున చెల్లించారని, అప్పట్లో తండాల్లోని ఇళ్లు, ఇళ్ల స్థలాలు కోల్పోయామని, వాటికి ఇంత వరకు పరిహారం చెల్లించలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వర్షాలకు తమ ఇళ్లు కూలిపోయే దశకు వచ్చాయని, కొత్త ఇళ్లు కట్టుకుందామన్నా అనుమతులు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి స్పందించి రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంతో పాటు, పరిహారం కూడా త్వరగా అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

బోరుమంటున్న రైతులు

జూలైలో 40 బోర్లు వేయించిన అన్నదాతలు

- కేవలం రెండు బోర్లలో అంతంత మాత్రమే నీటి లభ్యత
- ఫలించని భగీరథ ప్రయత్నం
- సాగునీటి కోసం ధర్మారం రైతుల తిప్పలు
- లద్నూరు రిజర్వాయర్ నింపి నీరందించాలని వేడుకోలు

మద్దూరు, ఆగస్టు 10: సాగునీటి కోసం మద్దూరు మండలం ధర్మారం గ్రామరైతులు రూ.లక్షలు వెచ్చించి చేసిన వారి భగీరథ ప్రయత్నం ఫలించలేదు. సాగునే నమ్ముకున్న వారు అప్పులు చేసి బోర్లు వేసినా చుక్కనీరు రాకపోవడంతో దిక్కుతోచకున్నారు. కేవలం 820 ఎకరాలు మాత్రమే సాగయ్యే ఆ గ్రామంలో ఒక్కనెలలోనే ఏకంగా 40 బోర్లు వేశారు. అందులో కేవలం రెండు బోర్ల నుంచి మాత్రమే నీరు వస్తుండడంతో ఒకటి, రెండు మళ్లలో సాగు చేస్తున్నారు.

ధర్మారంలో 820 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. 356 మంది రైతులు వివిధ పంటల్ని సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. 374 ఎకరాల్లో వరి, 302 ఎకరాల్లో పత్తి, 12 ఎకరాల్లో మొక్కజొన్న, 24 ఎకరాల్లో కంది, 3 ఎకరాల్లో కూరగాయ పంటల్ని సాగు చేస్తున్నారు. లద్నూరు గ్రామంలోని రిజర్వాయర్ నుంచి ధర్మారం మీదుగా కాలువ నిర్మాణం చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో లద్నూర్‌లోని రిజర్వాయర్‌లోకి వదిలిన దేవాదుల నీటిని పారించుకుని రైతులు గట్టెక్కారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయకపోవడంతో బోసిపోయింది. కాలువల్లో తుంగ మొలిచి వెక్కిరిస్తోంది. కాలువ పక్కన భూములు ఉన్న రైతులు బోర్లు వేసినా చుక్కనీటి జాడ లేదు. గత నెలలో సుమారు 15 మంది రైతులు దాదాపు 40 బోర్లు వేసి లక్షల్లో అప్పుల పాలయ్యారు.కొద్దోగొప్పో పోస్తున్న బోర్లతో ఒకటి రెండు మడుల్లో వరి సాగుచేస్తున్నారు. కాలువనీళ్లే ప్రధాన నీటి వనరుగా మారడంతో భగీరథ ప్రయత్నం చేసినా వారి ప్రయత్నాలు ఫలించకపోవడంతో బోరుమంటున్నారు. బోర్లు వేయించడానికి చేసిన అప్పులు తీరే మార్గం లేక ఆవేదన చెందుతున్నారు. లద్నూర్ రిజర్వాయర్ నింపి నీటిని అందించాలని వారు కోరుతున్నారు.



నీటి ప్రవాహం లేక కాలువలో మొలిచిన తుంగ



గత సంవత్సరం వేసిన బోరు నుంచి సన్నధారగా వస్తున్న నీరు

5 బోర్లు వేసినా చుక్కనీరు రాలేదు



నాకు 5 ఎకరాల భూమి ఉంది. గత సంవత్సరం రెండు బోర్లు వేసినా నీళ్లు పడలేదు. కాలువ పారడంతో పొలం అచ్చుకట్టి నీళ్లు పారించుకుని పంటసాగు చేశా. దేవుడి దయతో బయటపడ్డా. ప్రస్తుతం కాలువ పారడం లేదు. భూమిని పడావుగా వదిలేయలేక ఆశకొద్దీ రూ.1.80 లక్షలు అప్పు చేసి 5 బోర్లు వేసినా నీటిజాడ లేకుండా పోయింది. దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కాలువపారితేనే రందిపోతది.

- గుడిసె కిష్టయ్య, రైతు, ధర్మారం

కాలువ ద్వారా నీరు అందించాలి



కాలువ ద్వారా నీరు అందిస్తేనే ఎవుసం సాగయ్యే పరిస్థితి. గత సంత్సరంలో వేసిన బోరు గ్యాప్ ఇస్తూ పోస్తుంది. ఈ సంవత్సరం వేసిన మూడు బోర్లలో చుక్కనీరు పడలేదు. రూ.లక్ష మట్టిలో పోసినట్టైంది. గత ప్రభుత్వంలో లద్నూరు రిజర్వాయర్ నింపి కాలువ ద్వారా నీళ్లందించారు. ఈ సారి కూడా రిజర్వాయర్ నింపి మా భూములు సాగయ్యేలా చూడాలి..

- పల్లపు అఖిల్, రైతు, ధర్మారం

తీరని మల్లన్న వెతలు


- మండలం ఓ చోట... విధులు మరోచోట
- ఇబ్బందులకు గురవుతున్న ఆయా శాఖల అధికారులు
- పట్టించుకోని ప్రభుత్వం.. ప్రజాప్రతినిధులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

గజ్వేల్,ఆగస్టు10: మల్లన్నసాగర్ భూనిర్వాసితులతో పాటుగా వారికి సేవలందించే అధికారులకూ ఇబ్బందులు తప్పడం లేదు. మూడేళ్లుగా అటు ప్రజలు.. ఇటు అధికారులు ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వాలు మారినా వారి సమస్యలు మాత్రం తీరడం లేదు. నిర్వాసితులు సైతం ధర్నాలు, నిరసనలు చేపట్టినా కూడా వారి సమస్యలను పట్టించుకునే వారే లేరు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ రెవెన్యూ పరిధిలోని సంగాపూర్, ముట్రాజ్‌పల్లి, గజ్వేల్‌లో భూనిర్వాసిత కాలనీని ఏర్పాటు చేశారు. దాదాపుగా 3వేల ఇళ్లను నిర్మించారు. గ్రామాలను గజ్వేల్‌కు తరలిస్తున్న క్రమంలో తమ గ్రామాలను గ్రామపంచాయతీలుగానే కొనసాగించాలని, గతంలో మాదిరిగానే పాలన కొనసాగించాలని అప్పటికే సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా ప్రజాప్రతినిధులుగా ఉన్న నాయకులు కోరడంతో గత ప్రభుత్వం కొనసాగిస్తూ ఉత్తర్వులను ఇచ్చింది. ఈ క్రమంలో ప్రారంభమైన పాలన ఇంకా కొనసాగుతుండడంతో అధికారులు సరైన సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సమయానుగుణంగా అందని సేవలు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీ ప్రజలకు విద్య, వైద్య పంచాయతీతో పాటు ఆయా రకాల సేవలను అధికారులు ఇతర మండలాల నుంచి నిర్వహించడం ఇబ్బందిగా మారుతుంది. ప్రజలకు సరైన సమయంలో పౌర సేవలను అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. నిర్వాసితుల కాలనీలో తొగుట, కొండపాక మండలాలకు సంబంధించిన అధికారులు సేవలను అందిస్తున్నారు. నిర్వాసిత కాలనీలో ప్రస్తుతం అంతర్భాగంగా మారిన సంగాపూర్, లింగరాజ్‌పేటకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు గజ్వేల్ మండల అధికారులు సేవలను అందిస్తున్నారు. ఇక మండల స్థాయి అధికారులు అటు తొగుట, కొండపాక మండలాలతో పాటు ఇటు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సేవలను అందించడం కష్టతరంగా మారుతుందని వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులు గజ్వేల్‌లో విధులు నిర్వహించి ఏమైనా పనులు, సమావేశాలు ఉంటే మండల కేంద్రమైన తొగుట, కొండపాకకు వెళ్లాల్సి వస్తుంది. ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు టీకాలు, ఇతరత్రా మందులు, సమావేశాలుంటే మండలాలకు వెళ్లాల్సి రావడం.. విద్యాశాఖ అధికారులు సైతం తమ మండలానికి వెళ్లాల్సి వస్తుండడం, ఇతర శాఖల అధికారులు సైతం రెండు చోట్ల విధులు నిర్వహించడం తలకు మించి భారంగా మారుతుంది. ఇక సమయానికి అనుగుణంగా సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.



మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీ

వైద్య సేవలకు తప్పని ఇబ్బందులు

రెండు రోజుల క్రితం విషజ్వరం (డెంగీ అని అనుమానిస్తున్న) తో బాలుడు మృతిచెందడంతో మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు అందుతున్న పౌర సేవలపై అనుమానాలు తలెత్తుతున్నాయి. మండల కేంద్రం తొగుటలో ఉండడం, సేవలు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో అందించాల్సి రావడంతో అటు వైద్యాధికారులు, ఇటు వైద్య సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ప్రజలకు అవగాహన కల్పించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వైద్య సిబ్బందిని సమన్వయం చేయడంలో అటు అధికారులు, సమన్వయం చేసుకోవడంలో ఇటు సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు.

ప్యాకేజీ, పరిహారాలకు తప్పని దూరాభారం

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని భూనిర్వాసిత కాలనీ ప్రజలు తమకు రావాల్సిన నష్టపరిహారం, ప్యాకేజీ, ప్లాట్లు, ఇతరత్రా సదుపాయాల గూర్చి అటు మండల కేంద్రాలైన తొగుట, కొండపాకకు, డివిజన్ కేంద్రమైన సిద్దిపేటకు వెళ్లాల్సి వస్తుంది. రాకపోకలకు సమయం, డబ్బు వృథా అవుతున్నాయని వారు వాపోతున్నారు. తమకు అందాల్సిన సేవలను చేరువ చేయాలని, సమీపంలోని మండలంలో విలీనం చేయాలని ఆయా శాఖల అధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

రెండు చోట్లా విధులు భారంగా ఉంది

రెండు చోట్ల విధులు నిర్వహించడం భారంగా ఉంది. తొగుట మండలంలోని సగం గ్రామాలు గజ్వేల్‌లో ఉండడంతో ఇటు మండలాన్ని చూడడం అటు భూనిర్వాసిత కాలనీని చూడడం ఇబ్బందిగా ఉంది. అంతేకాకుండా తమ సిబ్బందితో సమన్వయం చేసుకోవడం లేదా వారు చేస్తున్న పనులను పర్యవేక్షించడం ఇబ్బందిగా మారుతుంది. ఈ క్రమంలో మండలంలో ఉంటే కాలనీలో సిబ్బంది పనులు చేయడం లేదు. కాలనీలో ఉంటే మండలంలో సిబ్బంది పనులు చేయడం లేదు. రెండు చోట్ల విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉంది.

- ఓ అధికారి

త్వరలోనే పుల్లూరుకు కాళేశ్వరం జలాలు

- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్, ఆగస్టు 10 : పుల్లూరు గ్రామానికి త్వరలోనే కాళేశ్వరం జలాలు రానున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. శనివారం సిద్దిపేటరూరల్ మండలం పుల్లూరులో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కనక దుర్గామాత ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన, బోనాల ఊరేగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలోనే పుల్లూరు గ్రామానికి కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు రానున్నాయన్నారు. అమ్మవారి ఆలయాన్ని రూ.12లక్షలతో అభివృద్ధి చేసుకున్నామని, గ్రానెట్, సిమెంట్‌ను కూడా అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో 'సుడా' మాజీచైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, మున్నూరు కాపు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



హరీశ్‌రావును సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు

ఊరంతా ఒక్కటై.. ఆ నలుగురుగా నిలిచి..

- అనాథ మహిళకు గ్రామస్థుల అంత్యక్రియలు

7లో

గురుకుల విద్యార్థికి అస్వస్థత

- అందుబాటులో లేని వైద్యురాలు, సిబ్బంది
- బైక్‌పై చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు

చేర్యాల, ఆగస్టు 10 : చేర్యాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న అరుణ్ శుక్రవారం రాత్రి ఆస్తమాతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. రోజువారీలాగే భోజనం చేసి రూంమేట్స్‌తో కలిసి డార్మెంటరీ రూంలోకి వెళ్లిన అరుణ్ కాసేపటికి ఊపిరిపీల్చుకోలేక ఇబ్బంది పడ్డాడు. పాఠశాలలో వైద్యుడు, సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో చికిత్స నిమిత్తం అరుణ్‌ను బైక్ పై ఎక్కించుకుని రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందజేయడంతో కొద్దిసేపటికి కోలుకున్నాడు. ఈవిషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పుల్లయ్యను వివరణ కోరగా, అరుణ్ కొంత మానసిక ఒత్తిడి వల్ల అస్వస్థతకు గురయ్యాడని, వైద్యురాలు వారాంతపు సెలవులో ఉండటంతో ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స అందజేసినట్లు తెలిపారు. ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



విద్యార్థిని బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్తున్న సిబ్బంది, తోటి విద్యార్థులు

నాచగిరి క్షేత్రంలో శ్రావణ సందడి

వర్గల్, ఆగస్టు 10 : శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు దర్శనానికి పోటెత్తారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ మాసం సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. సుమారు 30 మంది దంపతులు సత్యదేవుడి వ్రతాలు ఆచరించారు. స్వామివారికి నిజాభిషేకాలు 10, నిత్య కల్యాణాలు 4 జరిగినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. అన్నపూర్ణ తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో తెలిపారు.



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

చిన్నారులపై పిచ్చికుక్కల దాడి

- నాలుగు గేదెలపైనా కూడా..

దౌల్తాబాద్: ఆగస్టు 10 : పిచ్చికుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులు, నాలుగు గేదెలు గాయపడిన సంఘటన శనివారం దౌల్తాబాద్ మండలం గోవిందాపూర్‌లో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈదారపు ప్రావీణ్య(8), మేకల జై(8), పిట్ల మనుశ్రీ(3) ఇంటి ముందు ఆడుకుంటున్నారు. వారిపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. చిన్నారుల వీపు, కాలు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పెనుకుల నర్సింహులు, మంగలి రాజు, నందగిరి రాజేశ్వరి, మంగలి బిక్షపతి చెందిన గేదెలను కూడా పిచ్చికుక్కలు గాయపరిచాయి. గ్రామస్థులు పిచ్చికుక్కలను వెంబడించి చంపేశారు.



గాయపడిన చిన్నారులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్



తొగుట పోలీస్‌స్టేషన్‌లో మొక్కను నాటుతున్న సీఐ లతీఫ్

ములుగు, ఆగస్టు 10: ఇంటి ముందు మొక్కలు పెంచుకున్నట్లయితే కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ అన్నారు. స్వచ్ఛదనంపచ్చదనం కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమంలో అందరు భాగస్వాములై ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మొక్కలు నాటుకునే కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరారు. నాటిన ప్రతి ఒక్కరు బతికించుకోవడం కోసమే ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఆయన వెంబడి ఏఎస్‌ఐ శంకర్, అండాలు, హెడ్‌కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్

● **తొగుట:** వన మహోత్సవంలో భాగంగా శనివారం తొగుట పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ లతీఫ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో తొగుట ఎస్‌ఐ రవి కాంతారావు, ఏఎస్‌ఐలు రాంరెడ్డి, యాదగిరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బెజ్జంకి, ఆగస్టు 10: పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని కల్లెపల్లిలో శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోలిమల్ల నాంపల్లి (65) అనే వృద్ధుడికి కొద్ది రోజులుగా మతి స్థిమితం లేదు. దీనికి తోడు అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక డంపు స్వాధీనం



ఇసుక డంపుతో పోలీసులు

బెజ్జంకి, ఆగస్టు 10: మండలంలోని గాగిల్లాపూర్ శివారులోని కాలువ వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెజ్జంకి ఎస్‌ఐ కృష్ణారెడ్డి హెచ్చరించారు.

మహాత్మాగాంధీ విగ్రహాన్ని శుద్ధి చేసిన నాయకులు



గాంధీ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు

హుస్నాబాద్, ఆగస్టు 10: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకునేందుకు శనివారం హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ నాయకులు గాంధీ విగ్రహాన్ని శుద్ధి చేశారు. అనంతరం భారత మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్, సుభాష్‌చంద్ర బోస్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆగస్టు 15వ తేదీన ప్రతీ పౌరుడు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు లక్కిరెడ్డి తిరుమల, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు, కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, తోట స్వరూప, చందు, రాంప్రసాద్, అనంతస్వామి, సంతోష్, రాజేశ్ తదితరులు న్నారు.

గొర్రెల మందను ఢీకొట్టిన కాంక్రీట్ మిక్సర్

● 15 జీవాల మృతి

గజ్వేల్, ఆగస్టు 10: గొర్రెల మందను కాంక్రీట్ మిక్సర్ ఢీకొట్టిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్లలో శనివారం చోటుచేసుకున్నది. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోరే మల్లయ్య, బీడ భూమయ్యలు తమ జీవాలను మేత కోసం తీసుకువెళ్లేందుకు గ్రామంలోని రాజీవ్ రహదారిని దాటిస్తున్న క్రమంలో నాగపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సిమెంట్ కాంక్రీట్ మిక్సర్ కంటైనర్ అదుపు తప్పి గొర్రెల మందపైకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో 15గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, 20 గొర్రెలకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో తమకు దాదాపుగా రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు గొర్రె కాపరులు తెలిపారు. గాయాలైన గొర్రెలు కూడా బతికే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్‌కు గొర్రె కాపరులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చదువును 'దూర'ం చేసుకోవద్దు

- పదో తరగతి, ఇంటర్ చదివే వీలు
- ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్స్ షురూ
- ఉచిత పాఠ్యపుస్తకాలు, సెలవు దినాల్లో తరగతులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 10: చదువుకుంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చు. చదువు ప్రాధాన్యం ఒక్క మాటలో చెప్పలేం. అయితే, వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారికి మరో అవకాశం కల్పిస్తోంది దూర విద్య(సార్వత్రిక విద్య). చదువుకునేందుకు సరైన అవకాశాలు లేకపోవడం, అర్ధాంతరంగా నిలిపివేసిన వారికి, ఉద్యోగాల్లో పదోన్నతులకు ఉపయోగపడేలా తెలంగాణ ఓపెన్ స్కూల్‌తో ఉన్నత చదువులకు బాటలు వేయవచ్చు. ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు తాజాగా ప్రకటన విడుదలైంది.

ఉమ్మడి జిల్లాలో 110 అధ్యయన కేంద్రాలు

ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విద్యను 2008-09లో అందుబాటులోకి తెచ్చింది. ముందుగా పదో తరగతి చదివేందుకు మాత్రమే అవకాశం ఉండగా, ఆ తర్వాత మంచి స్పందన రావడంతో 2010-11లో దూర విద్యలో ఇంటర్‌ను చేర్చారు. అభ్యాసకులకు మరింత మేలు చేయాలన్న ఉద్దేశ్యంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 110 అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేసి సులభమైన విద్యావిధానంతో పది, ఇంటర్ తరగతులు కొనసాగిస్తున్నారు.

మధ్యలో మానేసిన వారికి సువర్ణావకాశం



ఓపెన్ స్కూల్ అడ్మిషన్ బుక్ లెట్‌ను విడుదల చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి(ఫైల్)

రెగ్యులర్ విద్యతో సమానం..

దూర విద్యలో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు ఇచ్చింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అభ్యాసకులు వృత్తి విద్య కోర్సును ఆప్షన్‌గా ఎంచుకోవచ్చు. ఇక ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ కోర్సులుంటాయి. ఇష్టమైన ఏ సబ్జెక్టులోనైనా కోర్సు పూర్తి చేయవచ్చు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ మీడియాలలో ఏదేని ఒక మీడియంలో చదవవచ్చు. విషయాల ఎంపిక విషయంలో అభ్యాసకుడికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. అడ్మిషన్ పొందిన తర్వాత ఐదు సంవత్సరాలలో తొమ్మిది పర్యాయాలు పరీక్ష రాసే అవకాశం ఉంటుంది. దూరవిద్య పూర్తి చేసిన వారు ఉన్నత విద్య, ఉద్యోగాలు పొందడానికి అర్హులు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు ఫీజు రాయితీ ఉంటుంది.

అర్హులెవరంటే..

దూరవిద్యకు 14 ఏళ్లు నిండిన వారందరూ అర్హులే. 15 సంవత్సరాలు నిండి 10వ తరగతి పూర్తయిన వారందరూ ఇంటర్ కోర్సు చదువుకునే అవకాశం ఉంటుంది. ఇంటర్‌లో మానేసిన వారికి, ఫెయిలైన వారికి ఇంటర్మీడియట్ చదువుకునే వీలుంది. సెలవు దినాల్లో మాత్రమే తరగతులు ఉంటాయి. ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేస్తారు. మహిళలు, పలు వృత్తి, వ్యాపార రంగాల్లో ఉన్న వారికి, ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు, వివిధ సంఘ సభ్యులకు, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఇదొక సదావకాశంగా చెప్పవచ్చు.



అడ్మిషన్ ఇలా

ఓపెన్ స్కూల్ విధానంలో పది, ఇంటర్ కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభంకాగా, వచ్చే నెల(సెప్టెంబరు) 10 తారీఖు వరకు ప్రవేశ గడువు ఉంది. పదో తరగతి ఓసీ కేటగిరీలో పురుషులకు అడ్మిషన్ ఫీజు రూ.1400 చెల్లించాలి. మిగతా వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పురుషులు, మహిళలందరికీ రూ.1000 చెల్లించాలి. ప్రాస్పెక్టస్ ఫీజు రూ.150 అదనం. ఇంటర్ ఓసీ కేటగిరీకి చెందిన వారైతే పురుషులు రూ.1500, మిగతా వారు రూ.1200 చెల్లించాలి. ప్రాస్పెక్టస్ ఫీజు రూ.300, ఆన్‌లైన్‌లో ప్రవేశాలు పొందవచ్చు. తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్ పొందాలి. అడ్మిషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి రసీదు, అడ్మిషన్ ఫారం ప్రింట్‌తో కలిపి అధ్యయన కేంద్రంలో సమర్పిస్తే సమాచారం మెసేజ్ రూపంలో సెల్‌ఫోన్‌కు అందుతుంది.

ఓపెన్ విద్య అందరికి వరం

చదువు మధ్యలో మానేసిన వారికి దూరవిద్య వరంలాంటిందని డీఈవో వెంకటేశ్వర్లు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్హతలు పెంపొందించడానికి, ఉపాధి అవకాశాలకు దూర విద్య దోహదపడుతుందన్నారు. గతేడాది పదో తరగతిలో 71.04 శాతం, ఇంటర్ 60.72 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఓపెన్ విద్యకు సంబంధించిన సమాచారం కోసం 8008403635 నంబరును సంప్రదించాలని కోరారు.



బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘాల నాయకులు

శ్రీనివాస్‌నగర్‌లో ఇంటర్‌సిటీ రైలు ఆపాలి

- కేంద్రమంత్రికి పలు సంఘాల వినతి

మాసాయిపేట, ఆగస్టు 10: మాసాయిపేట మండల కేంద్రంలోని శ్రీనివాసనగర్ రైల్వేస్టేషన్‌లో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును ఆపాలని, మేడ్చల్ వరకు నడిచే లోకల్ రైళ్లను ఒడియారం వరకు పొడగించాలని ఉపాధ్యాయ, వర్తక, వాణిజ్య సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం వారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీనివాసనగర్ రైల్వేస్టేషన్‌లో గతంలోలా ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలని, దీంతో మాసాయిపేటతోపాటు వెల్దుర్తి, తూప్రాన్, చేగుంట తదితర మండలాలకు చెందిన ఉద్యోగులు, వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని కేంద్ర మంత్రికి వివరించారు. కూరగాయల వ్యాపారులు ఈ ప్రాంతాల నుంచి ఇటు హైదరాబాద్, అటు నిజామాబాద్ వరకు ప్రయాణిస్తుంటారని వివరించారు. గతంలో ఇక్కడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఉండేదని గుర్తు చేశారు. మేడ్చల్ వరకు నడుస్తున్న ఎంఎంటీఎస్‌ను ఒడియారం వరకు పొడగించాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ సమస్య పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉపాధ్యాయ సంఘ నాయకులు రంగారెడ్డి, శర్మ, ఇమ్మడి వెంకటేశం, ధర్మపురి సంజయ్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

చేర్యాల, ఆగస్టు 10: కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామశివారులో విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. గడ్డిమేస్తూ పాడిగేదె ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని, దీంతో రూ.60వేల నష్టం వాటిల్లిందని పుట్ట కరుణాకర్ వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నీటి సంపులో పడి వానరాల మృతి

బెజ్జంకి, ఆగస్టు 10: ఆలయ ఆవరణలోని నీటి సంపులో పడి ఐదు వానరాలు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో శనివారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వెనకాల ఉన్న నీటి సంపు ఉండగా, దానికి ఎవరూ వినియోగించడం లేదు. అయితే, ఆ సంపులో ఎప్పుడు పడ్డాయో కానీ, ఐదు వానరాలు మృత్యువాతపడ్డాయి. వాటి కళేబరాలు నీటిపై తేలియాడుతుండగా, శనివారం భక్తులు గుర్తించారు. వాటిని బయటకు తీసి, మాజీ సర్పంచ్ నర్సయ్య వానరాలకు అంత్యక్రియలు చేశారు. ఆలయ ఆవరణలోని ఆ నీటి సంపును కొన్నేళ్లుగా ఎవరూ వినియోగించడం లేదు. ఆలయ వెనుక భాగంలో ఉండటంతో దానిని ఎప్పుడో తప్ప పట్టించుకోరు. ఈ క్రమంలో వానరాలు పడిన విషయాన్ని ఆలస్యంగా గుర్తించారు.

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ఎంపీ



నారాయణఖేడ్, ఆగస్టు 10: జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ పార్లమెంట్ సమావేశాలు ముగిసిన క్రమంలో శనివారం ఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోవు పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాల ఎంపీలకు మాట్లాడేందుకు అధిక సమయాన్ని కేటాయించాలని ఆయనను కోరారు.

సిద్దిపేట నుండి కొమురవెల్లికి..
పాదయాత్రగా వచ్చిన అదనపు కలెక్టర్



మల్లన్నను దర్శించుకున్న అదనపు కలెక్టర్

చేర్యాల, ఆగస్టు 10: సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సాధారణ భక్తుడిగా జిల్లా కేంద్రం నుంచి కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి పాదయాత్రగా వచ్చారు. శనివారం ఉదయం అక్కడి నుంచి నడుచుకుంటూ బయలుదేరిన ఆయన ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందించగా, ఈవో బాలాజీశర్మ స్వామివారి ప్రసాదం అందించారు.

జమ్మూకశ్మీర్ ఎఫ్‌సీఐ జీఎంగా నర్సాపూర్ వాసి



నర్సాపూర్, ఆగస్టు 10: జమ్మూకశ్మీర్ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) జనరల్ మేనేజర్‌గా నర్సాపూర్ మండలం మహ్మదాబాద్‌కు చెందిన చత్రునాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. మారుమూల తండాలో జన్మించిన చత్రునాయక్ కష్టపడి చదివి ఎఫ్‌సీఐలో ఉద్యోగం సంపాదించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పలు హోదాల్లో పని చేశారు. మొన్నటి వరకు ముంబైలోని ఎఫ్‌సీఐ డీజీఎంగా ఉన్న ఆయన పదోన్నతిపై జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి బదిలీపై వెళ్లారు.



బైక్ ర్యాలీగా వస్తున్న హనుమాన్ భక్తులు

వర్షాల కోసం హనుమాన్ ఆలయాల్లో పూజలు

కల్హేర్, ఆగస్టు 10: వర్షాకాలం ప్రారంభమై రెండు మాసాలు కావస్తున్నా సరైన వర్షాలు కురవక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రమైన కల్హేర్‌కు సరిహద్దున ఉన్న కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల పరిధిలోని వెలగనూరు, ముంగ్లూర్ గ్రామాలకు చెందిన వందలాది మంది హనుమాన్ భక్తులు, రైతులు వేర్వేరుగా బైక్ ర్యాలీ నిర్వహిస్తూ శనివారం కల్హేర్‌కు చేరుకున్నారు. కల్హేర్‌లోని హనుమాన్ మందిర్, రామాలయాల్లో స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి, వర్షాలు కురిపించాలని ప్రార్థించారు. అనంతరం కల్హేర్ మండలంలోని మహాదేవ్‌పల్లి, మాసాన్‌పల్లి, ఇందిరానగర్, మార్డి, బీబీపేట, ఫత్తేపూర్, పిట్లం మండలంలోని తిమ్మానగర్, మార్‌దండ, పిట్లం, నిజాంసాగర్ మండలంలోని ముంగ్లూర్, నర్సింగ్‌రావ్‌పల్లి, బ్రహ్మణపల్లి తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లోనూ వర్షాల కోసం పూజలు చేశారు. బైక్ ర్యాలీగా కల్హేర్‌కు వచ్చిన హనుమాన్ భక్తులకు కల్హేర్ మాజీ ఎంపీటీసీ సంగప్ప, మాజీ సర్పంచ్ లచ్చప్ప బాలయ్య, బీజేపీ నాయకులు కిష్టయ్య, విఠల్, పండరీ, పరుశురాం, బజరంగ దళ్, రామాలయ సేవక బృందం, యువజన సంఘాల బాధ్యులు స్వాగతం పలికారు.

పంచాక్షరి జపయజ్ఞానికి సిద్దేశ్వరాలయం ముస్తాబు



జపయజ్ఞం కోసం ఏర్పాట్లు

కంగ్టి, ఆగస్టు 10: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్న కంగ్టి సిద్దేశ్వరాలయంలో ఈనెల 12న శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని శివ పంచాక్షరి జపయజ్ఞం వైభవంగా కొనసాగనుంది. పసల్వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం మహేశ్వర శర్మసిద్దంతి ఆధ్వర్యంలో దారం సౌమ్య, సంజయ్ దంపతులు ఈ బృహత్కార్యక్రమం చేపడుతున్నారు. వివిధ సంగీత స్వరాల మధ్య శివ పంచాక్షరి జపం, శివ నామామృతం, మహా హారతి, అన్న ప్రసాద వితరణ, కొనసాగనున్నాయి. జిల్లాతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలకు అత్యంత చేరువగా ఉన్న ఈ ప్రసిద్ధ పుణ్య క్షేత్రానికి వేలాదిగా భక్తులు వస్తారు. ఈ మేరకు సంజయ్, సౌమ్య దంపతులు శనివారం కంగ్టిలో ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు.

ఊరంతా ఒక్కటై.. ఆ నలుగురుగా నిలిచి..

- అనాథ మహిళకు గ్రామస్థుల అంత్యక్రియలు
- 25 ఏళ్ల క్రితం మతిస్థితిమితం లేక గ్రామానికి..
- అప్పటి నుంచి గ్రామస్థుల చేయూతతోనే బతుకు



రాములమ్మ(ఫైల్)

జోగిపేట, ఆగస్ట్ 10, ఈనాటి బంధమేనాటిదో అన్నట్లుగా ఎక్కడి నుంచో వచ్చి గ్రామంలో నివసిస్తూ మృతి చెందిన ఓ అనాథ వృద్ధురాలికి ఊరంతా కలిసి అంత్యక్రియలు జరిపిన ఉదాత్తమైన ఘటన మండలంలోని రాంసాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. ఊరు ఊరంతా ఏకమై, ఒక్కటిగా నిలిచి, ఆమెకు అంత్యక్రియలు జరిపిన సంఘటన గ్రామస్థుల పెద్ద మనసుకు అద్దం పట్టింది.

సుమారు 25 ఏళ్ల క్రితం ఓ మధ్యవయస్కురాలు రాంసాన్‌పల్లి గ్రామానికి చేరింది. అప్పటికే ఆమె కాసింత మతిస్థిమితం తప్పినదానిలా ఉండేది. వివరాలడిగితే.. తాను రాయలసీమ ప్రాంతానికి చెందిన బాగా సాగిన కుటుంబానికి చెందిన మహిళనని చెప్పుకునేదట.. పేరు రాములమ్మ అని చెప్పినప్పటికీ, సొంతూరు ఏదంటే మాత్రం సమాధానం చెప్పేది కాదట. పైపెచ్చు, తాను ఇక్కడే ఉంటానని ఏడ్చేదట. దీంతో గ్రామస్థులు సదరు మహిళను అక్కున చేర్చుకున్నారు. గ్రామంలోని పంచాయతీ భవనంలో ఉండమని చెప్పి, అక్కడే ఆశ్రయం కల్పించారు. గ్రామస్థులంతా కలిసి సమావేశమై సదరు మహిళను తమ గ్రామస్థురాలిగానే భావించి, ఆమెకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు కూడా ఇప్పించారు. దీంతో, రాములమ్మ 25 ఏళ్లుగా గ్రామంలోనే నివసిస్తోంది. అయితే, శుక్రవారం రాత్రి ఆమె కన్నుమూసింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఇన్నాళ్లు తమ ఆదరణతోనే బతికిన ఆమెకు కలిసికట్టుగా అంత్యక్రియలు చేయాలని నిర్ణయించారు. గడపకింత చొప్పున చందాలు వేసుకోవడంతో పాటు ప్రతీ ఇంటి నుంచి ఒకరు హాజరై రాములమ్మకు ఆదివారం అత్యక్రియలు నిర్వహించారు. అనాథగా తమ ఊరికి చేరిన రాములమ్మను అక్కున చేర్చుకోవడమే కాకుండా... మృతిచెందిన రాములమ్మను, తమ గ్రామ మహిళగా భావించి, అంత్యక్రియలు కూడా నిర్వ హించి తమ ఉదాత్తతను, పెద్ద మనసును చాటుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారా గ్రామస్థులు.



రాములమ్మ మృతదేహాన్ని మోస్తున్న గ్రామస్థులు

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు


పుల్‌కల్, ఆగస్టు, 10: మండల కేంద్రం చౌటకూర్‌కు సమీపంలో సంగారెడ్డి, నాందేడ్-అకోలా 161వ జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడిన సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని శివంపేట గ్రామానికి చెందిన కుమ్మరి శ్రీహరి (38) జోగిపేటలో ఆటోను అద్దెకు మాట్లాడుకుని కిరాణ సామగ్రి తీసుకుని వస్తున్నాడు. ఆటో డ్రైవర్ చౌటకూర్ సమీపంలోకి రాగానే బసన్నవాగు వద్ద మరో లారీని ఓవర్‌టెక్ చేయబోతుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో కుమ్మరి శ్రీహరి తలకు బలమైన గాయాలై, కాలు విరిగింది. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆటో అతివేగంగా, ఆ జాగ్రత్తగా నడపడం వల్ల బోల్తా కొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడిన వారిని సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే, కుమ్మరి శ్రీహరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.




ఆటోలో ఇరుక్కుపోయిన శివకుమార్

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆటో..

టేక్మాల్, ఆగస్టు 10: చెట్లకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఆటో ఢీ కొని ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మాట్‌పల్లి గ్రామశివారులో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతులగూడ గ్రామానికి చెందిన శివకుమార్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం జోగిపేట వైపు నుంచి బొడ్మాట్‌పల్లి వైపు వస్తుండగా, 161 జాతీయ రహదారిపై చెట్లకు నీళ్లు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఢీ కొన్నాడు. దీంతో శివకుమార్‌తో పాటు ఆటోలో ఉన్న మరో వ్యక్తికి తీవ్రంగా గాయలైయ్యాయి. గమనించిన హైవే సిబ్బంది గాయపడిన వారిని అంబులెన్స్‌లో జోగిపేట ఆసుపత్రికి తరలించారు.







జలజీవన్ మిషన్ సెంట్రల్ కమిటీ సభ్యుల పర్యటన

బెజ్జంకి, ఆగస్టు 10: మండలంలోని తోటపల్లిలో శనివారం జలజీవన్ మిషన్ సెంట్రల్ కమిటీ సభ్యులు పర్యటించారు. గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతను పరీక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింగరావు, డీఈ, సెంట్రల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి'


మాట్లాడుతున్న భిక్షపతి

చేర్యాల, ఆగస్టు 10: తపాలాశాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనగామ వెస్ట్ సబ్ డివిజన్ మెయిల్ ఓవర్సీర్ భిక్షపతి అన్నారు. కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లి గ్రామపోస్టాఫీసు కార్యాలయంలో స్థానిక సబ్ పోస్ట్‌మాస్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తపాలాశాఖ సేవలు సులభ పద్ధతిలో ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్‌పోస్ట్‌మాస్టర్లు సంతోశ్‌కుమార్, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.

నిధుల్లేక నిలిచిన పనులు

- బిల్లులు రాక చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు
- ప్రభుత్వం మారడంతో రద్దయిన పీఆర్ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నారాయణరావుపేట/సిద్దిపేట రూరల్, ఆగస్టు 10: గ్రామీణ ప్రాంతాల్లోని మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు గాను గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు పంచాయితీరాజ్‌శాఖ నుంచి నిధులు మంజూరు చేయించారు. కానీ ప్రభుత్వం మారడంతో పనులు చేపట్టేందుకు నిధులు లేకపోవడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కల్వర్టులు, డ్రైన్‌లు నిర్మించి బిల్లులు రాకపోవడంతో బిల్లులు వచ్చే వరకు పనులు చేసేదిలేదనే భీష్మించుకు కూర్చున్నారు. కొత్త ప్రభుత్వం మంజూరైన రోడ్లను కూడా రద్దు చేసినట్లు తెలుస్తున్నది.

వాహనదారులకు తప్పని తిప్పలు

చిన్నపాటి వర్షాలకే రోడ్లు గుంతల మయంగా మారుతున్నాయి. రోడ్డుపై వేసిన కంకర కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీని కారణంగా తరచూ ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం మారడంతో గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులు విడుదలలో జాప్యం కారణంగా పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడంలేదు.

అర్ధాంతరంగా నిలిచిన పనులు

పంచాయితీరాజ్‌శాఖ నుంచి మంజూరైన రోడ్లకు చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు-బండచేర్లపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులను కంకర వేసి మధ్యలోనే వదిలేయగా పుల్లూరు ఎస్సీ కాలనీ నుంచి రామంచ వరకు, ఇంద్రగూడెం నుంచి అప్పనపల్లి వరకు కేవలం కల్వర్టుల నిర్మాణంకే పరిమితం చేశారు. ఇర్కోడు నుంచి చిన్నగుండవెల్లి వరకు చేపట్టాల్సిన బీటీ రోడ్డు నిధులు రద్దుచేసినట్లు సమాచారం. అదేవిధంగా నారాయణరావుపేట మండలంలోని మాటిండ్ల నుంచి జిల్లేల్ల వరకు నక్కవాగుపై కల్వర్టు నిర్మాణం, గుర్రాలగొంది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకు కల్వర్టులు నిర్మించి బీటీ రోడ్డు పనులు చేయకుండానే వదిలేశారు. గోపులాపూర్, మల్యాల బీటీ రోడ్ల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించనే లేదు. దీంతో ఆ రోడ్లగుండా వేళ్లే రైతులు, వాహనదారులకు చిన్నపాటి వర్షం వచ్చినా ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే నిధులు విడుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కాంట్రాక్టర్ పనులు నిలిపివేసిన పుల్లూరు-బండచేర్లపల్లి రోడ్డు


రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ (ఫైల్)

పనులు పూర్తి చేయాలి



రోడ్డు నిర్మాణం కోసం వేసిన కంకర వల్ల వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నది. చిన్నపాటి వర్షాలకే రోడ్డు గుంతల్లో నీరు నిలవడం, కంకర కారణంగా తరుచూ ప్రమాదలు చోటుచేసుకుంటున్నాయి. అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు పనులను పూర్తి చేయాలి.

- మహేశ్, వాహనదారుడు, సిద్దిపేట

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు వీడ్కోలు


ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డును సన్మానిస్తున్న ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, తదితరులు

చిన్నకోడూరు, ఆగస్టు 10: సిద్దిపేట జిల్లాలో యంటీ సెక్షన్‌లో డ్రైవర్‌గా సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు కె. జీవన్‌రెడ్డిని చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని సీఏఆర్‌హెడ్ క్వార్టర్‌లో శనివారం ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్ శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేష జీవితాన్ని కుటుంబసభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, ధరణికుమార్, ఆర్ఎస్ఐ బాలకృష్ణ, ఏఆర్ కానిస్టేబుల్ ప్రవీణ్, హోంగార్డుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్, హోంగార్డ్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయురాలికి సన్మానం


ఉపాధ్యాయురాలు ఉమారాణిని సన్మానిస్తున అతిథులు

కొండపాక, ఆగస్టు 10: మండలంలోని మర్పడగ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఈ. ఉమారాణిని హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ కవితాగానానికి గాను సత్కరించి అభినందించారు. తెలుగు భాషా చైతన్య సమితి, నక్క వెంకటమ్మయాదవ్, నక్క యాదగిరిస్వామి ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఫౌండేషన్, శ్రీత్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో కుసుమధర్మన్న కళాపీఠం ముద్రించిన మహాకవి దాశరథి, డాక్టర్ సి.నారాయణరెడ్డిల పుస్తక ఆవిష్కరణ సభ శనివారం త్యాగరాయగాన సభలో నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి, సినారెల గురించి కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రతిభ కనబరచి ఉమారాణిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, సభాధ్యక్షులు శ్రీ గంటా మనోహర్‌రెడ్డి, విశిష్ట అతిథులు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి యన్. బాలచారి, శ్రీకళ జనార్దన మూర్తి, త్యాగరాయ గాన సభాధ్యక్షుడు రామకృష్ణ చంద్రమౌళి, అనంత కృష్ణ శర్మ, అర్ధచంద్ర ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకునూరు జీపీ కార్యదర్శికి మెమో

- అనుమతులులేని ఇంటినిర్మాణాలకు సహకరిస్తున్నాడని ఫిర్యాదు

చేర్యాల, ఆగస్టు 10: ఆకునూరు జీపీ కార్యదర్శి పులి బాలయ్య వ్యవహారశైలిపై స్థానికులు మండిపడుతున్నారు. సక్రమంగా పౌరసేవలు అందించడం లేదని, గ్రామంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడమే కాకుండా వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపిస్తున్నారు. గ్రామంలో పలువురు అనుమతులు పొందకుండా, సెట్‌బ్యాక్ లేకుండా యథేచ్ఛగంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు కొనసాగిస్తున్నారని, వారిపై బాలయ్య ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఇటీవల స్థానికులు కలెక్టర్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో పాటు అతడిపై వచ్చిన ఫిర్యాదుపై వారంలోగా సంజాయిషీ ఇవ్వాలని మెమో జారీచేశారు.


ఆకునూరు గ్రామపంచాయతీ కార్యాలయం

మెమో జారీ చేశాం: ఎంపీవో మహబూబ్ అలీ

అక్రమ నిర్మాణాలపై జీపీ కార్యదర్శి బాలయ్య చర్యలు తీసుకోవడం లేదన్న ఫిర్యాదు మేరకు సంజాయిషీ కోరుతూ మెమో జారీ చేశాం. సోమవారం గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటాం.

గౌరవెల్లి పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలి

- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 10: గౌరవెల్లి పెండింగ్ పనులు పూర్తి చేసి ఈ ప్రాంత వ్యవసాయానికి సాగు నీరు అందించాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాజెక్టు పనుల కోసం రూ.437 కోట్లు కేటాయింప చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

మర్పడగలో మున్సిపల్ చైర్‌పర్సన్ పూజలు


పూజలు చేస్తున్న చైర్‌పర్సన్

కొండపాక, ఆగస్టు 10: మండలంలోని మర్పడగ గ్రామంలోని శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రాన్ని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియాచంద్రశేఖర్‌రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవిజయ దుర్గా మాతకు, సంతాన మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆశీస్సులు తీసుకున్నారు. ఆమె వెంట కామారెడ్డి కౌన్సిలర్‌లు శివకృష్ణమూర్తి, వంశీకృష్ణ, మాజీ కౌన్సిలర్ జూలూరి సుధాకర్ తదితరులు ఉన్నారు.

పద్మశాలి యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన యువజన సంఘం నూతన కార్యవర్గం సభ్యులు

కోహెడ, ఆగస్టు 10: మండలంలోని బస్వాపూర్‌లో శివ భక్త మార్కండేయ యువజన సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేముల నరేష్, ఉపాధ్యక్షుడిగా గాదాసు భాస్కర్, కోశాధికారిగా ఈగ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొక్కుల రమేష్, సంతోష్, వేముల శ్రీపాల్, బూర మల్లికార్జున్, మహేందర్, శంకర్, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి అంబేడ్కర్ మాల సంఘం అధ్యక్షుడిగా రాజేశం



మిరుదొడ్డి, ఆగస్టు10: మండల కేంద్రమైన మిరుదొడ్డి అంబేడ్కర్ మాల సంఘం అధ్యక్షుడిగా మద్దెల రాజేశంను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా దారస్వామి, ర్యాకం పెద్దబాబు, ప్రధానకార్యదర్శిగా అన్నస్వామి, సంయుక్త కార్యదర్శిగా బిక్షపతి, రాజయ్య, కోశాధికారిగా మద్దెల స్వామి, సాంస్కృతిక కార్యదర్శిగా అంజి, సలహాదారులుగా నర్మల చంద్రం, ర్యాకం నర్సింహులు, రాజయ్య, అంజయ్య, నర్సింహులు, మల్లయ్య, చంద్రం, మంకయ్య, తదితరులున్నారు.

త్రీ-ఫేజ్ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

చేర్యాల, ఆగస్టు 10: చేర్యాల మండలం ముస్త్యాల సబ్‌స్టేషన్ పరిధిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు చేస్తున్నందున నేడు, రేపు నాలుగు మండలాల పరిధిలో త్రీ-ఫేజ్ విద్యుత్ సరఫరా వేళను మార్చనున్నట్లు టీజీఎస్‌పీడీసీఎల్ చేర్యాల ఏడీఈ రత్నవీరాచారి తెలిపారు. 132కేవీ సబ్‌స్టేషన్‌లో అదనంగా 50ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్నామని, ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు త్రీఫేజ్ సరఫరా నిలిపి వేసి సింగిల్‌ఫేజ్ సరఫరా ఉంటుందన్నారు. సాయంత్రం 6గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము 6గంటల వరకు త్రీ ఫేజ్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దూరు, ఆగస్టు 10: మండలంలో రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సుధీర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. నేడు, రేపు చేర్యాల మండలంలోని ముస్త్యాల సబ్‌స్టేషన్‌లో కొత్త పీటీఆర్ ఏర్పాటు చేస్తున్నందున ఉదయం 6 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు. వెల్దండ సబ్‌స్టేషన్ నుంచి సింగిల్ ఫేజ్ తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి

హుస్నాబాద్, ఆగస్టు 10: భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ ఫోరం జిల్లా నాయకులు హుస్నాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. భౌతిక రసాయన ఉపాధ్యాయులను సంబంధం లేని ఆరు, ఏడు తరగతులకు గణితం పీరియడ్లను కేటాయిస్తున్నారని, దీని వల్ల విద్యా ప్రమాణాలు తగ్గి ఉన్నత విద్యలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుల జిల్లా ఫోరం అధ్యక్షుడు ఎండీ. సాదత్ అలీ, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, వెంకటనారాయణ, డివిజన్ సభ్యులు చింతకింది శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రాజమౌళి, మన్మోహన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, బిక్షపతి, ఆత్మలింగం, మార్కండేయ, రవీందర్, పెద్దిరాజు తదితరులున్నారు.

సంక్షేమ భవనానికి నిధులు మంజూరు చేయాలి


మంత్రి 'పొన్నం'తో ముదిరాజ్ సంఘం నాయకులు

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 10: ముదిరాజ్‌ల సంక్షేమ భవనం కోసం నిధులు మంజూరు చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలో అతిపెద్ద సామాజిక వర్గమైన ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం కమ్యూనిటీ భవనం, ఫంక్షన్ హాల్ కోసం 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. పోతారం(ఎస్) గ్రామ శివారులోని సర్వే నెంబర్ 54లో ఉన్న ప్రభుత్వ భూమిలో 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపినట్లు ముదిరాజ్ సంఘం నాయకులు మంత్రికి వివరించారు. అందుకు స్పందించి మంత్రి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కృషిచేస్తానన్నారు. గత నెలలో హుస్నాబాద్ పట్టణంలోని ముదిరాజ్ భవన రీడింగ్ రూం నిర్మాణం కోసం రూ. 50 లక్షలు మంజూరు చేయించినట్లు మంత్రి పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో గీకురు రవీందర్, పెండ్యాల అయిలయ్య, పొన్నబోయిన శ్రీనివాస్, పొన్నం మల్లయ్య, శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, ప్రశాంత్, కాశబోయిన రవి, పులికాశి రమేష్ ఉన్నారు.

నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు


సిద్దిపేట టౌన్: చెక్కులు పంపిణీ చేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 10: నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చిన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో శనివారం 217 మందికి రూ.49 లక్షల 91 వేల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఎగవేత, కోతల ప్రభుత్వంగా మారిపోయిందని ఆరోపించారు. అనంతరం సిద్దిపేటలోని సంతోషిమాత ఆలయ మాజీ చైర్మన్ మంకాల నవీన్ కుటుంబాన్ని, పార్టీ సీనియర్ నాయకుడు నందును పరామర్శించారు. ఇటీవల ప్రమాదంలో గాయపడిన మున్సిపల్ ఉద్యోగి సామల ఐలయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

ఏడు నెలలుగా జీతాలు రాక సతమతమవుతున్నాం

సిద్దిపేట రూరల్, ఆగస్టు 10: 'మాకు ఏడు నెలల నుంచి జీతభత్యాలు రాక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాం' అని గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యే హరీశ్‌రావుకు విన్నవించారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామ పర్యటనలో ఉన్న ఆయన్ను పారిశుధ్య కార్మికులు కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీతాలు వచ్చే విధంగా కృషి చేస్తానని హరీశ్‌రావు కార్మికులతో అన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శ

నారాయణరావుపేట, ఆగస్టు 10: మండల కేంద్రంలో పలువురి మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం పరామర్శించారు. ఇటీవల తల్లి మృతిచెందిన రైతుబంధు మాజీ అధ్యక్షుడు నర్సన్న శేఖర్, తండ్రి మృతిచెందిన పార్టీ సీనియర్ కార్యకర్త గంటా శేఖర్ కుటుంబాన్ని, గ్రామ మహిళా సమాఖ్య సీఏ లావణ్య వారి అత్త ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. ఆయనవెంట పార్టీ మండల అధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య, మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ, నాయకులు సంతోష్ కుమార్, హరీశ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.


సిద్దిపేట రూరల్: ఎమ్మెల్యే హరీష్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, ఆగస్టు 10: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విలేజ్ బ్యాగును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విలేజ్ బ్యాగును అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టర్ అధికారి భాస్కర్, నోడల్ అధికారి అంజాగౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, వీవో మహిపాల్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ గౌతమి, ఎర్త్ ఫౌండేషన్ సభ్యులు ఆంజనేయులు, రాజు, నిహారిక, ప్రశాంత్ తదితరులున్నారు.



విలేజ్ బ్యాగును ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత


మర్కుక్: ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

మర్కుక్, ఆగస్టు 10: మండలంలోని ఎర్రవల్లికి చెందిన చెవిటి సోని(30) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం మృతురాలి కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో జగదేవ్‌పూర్ సహకార సంఘం మాజీ చైర్మన్ బాల్‌రాజు, మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, బాల్‌నర్సయ్య, పరశురాములు, కృష్ణ, శ్రీను తదితరులు ఉన్నారు.

- **చేర్యాల:** క్యాన్సర్ బారినపడి చేర్యాల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించిన లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు దీపాంజలి, పెద్ది తిరుపతిరెడ్డి రూ.10వేలు ఆర్థికసహాయం అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గంపల మహేశ్వరి, పెద్ది మంజుల, గంపల రాజలింగారె డ్డి తదితరులు పాల్గొన్నారు.


చేర్యాల: నగదును అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు దీపాంజలి, తిరుపతిరెడ్డి

అంత్యక్రియలకు హాజరైన ఆవుల

మాసాయిపేట, ఆగస్టు 10 : కాంగ్రెస్ మండల సీనియర్ కార్యకర్త ముక్క దశరథం తల్లి పోచమ్మ శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించగా పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి హాజరయ్యారు. దశరథం కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఐక్యతతోనే గీతా కార్మికుల సమస్యల పరిష్కారం

- సహకార సంఘం చైర్మన్ రమేష్‌గౌడ్


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

నంగునూరు, ఆగస్టు 10: ఐక్యతతోనే గీత కార్మికుల సమస్యలు పరిష్కరించుకోవాలని నంగునూరు సహకార సంఘం చైర్మన్ కోల రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. నంగునూరులో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకుని శనివారం బైక్ ర్యాలీ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడిపోతున్న గీత కార్మికులు ఆర్థికంగా ఎదగాలంటే రాజకీయంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కోల మహేందర్, అనగొని పరుశరాములు, రంగు అశోక్, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలుగౌడ్, సిద్ధిశ్వర్, శ్రీనివాస్, వివిధ గ్రామాల గౌడ సంఘం నేతలు పాల్గొన్నారు.

'కృష్ణస్వామి ముదిరాజ్ ఆశయాలను కొనసాగిద్దాం'

నంగునూరు, ఆగస్టు 10: కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముదిరాజ్ సేవా సమితి జిల్లా ఇన్‌చార్జి కొంతం శ్రవణ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పడిగే ప్రశాంత్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. నంగునూరులోని ముదిరాజ్ సంఘంలో ఆధ్వర్యంలో కొరివి కృష్ణస్వామి విగ్రహ ఆవిష్కరణ సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 25న ఉదయం 11 గంటలకు సిద్దిపేటలో కొరవి కృష్ణ స్వామి ముదిరాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముదిరాజ్ సోదరులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యామ ధర్మ, మిద్దె రవి, రావుల రాజు, పడిగే ప్రశాంత్, జిల్లెల్ల సుధాకర్, కొంతం శ్రావణ్, బైరి సాయి, బోనాల శ్రీనివాస్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సమావేశాన్ని విజయవంతం చేయాలి'

ములుగు, ఆగస్టు 10: నేడు మండల కేంద్రమైన ములుగులో నిర్వహించే రజక సంఘ సమావేశాన్ని విజయవంతం చేయాలని రజక సంఘం మండల అధ్యక్షుడు రాజు కోరారు. ములుగులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రజక సంఘం మండల సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత


ఫోన్‌ను అందజేస్తున్న ఎస్ఐ

జగదేవ్‌పూర్, ఆగస్టు 10: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను జగదేవ్‌పూర్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అందజేశారు. జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. తిగుల్ నర్సాపూర్‌కు చెందిన కంచర్ల కొండల్, మే 21ను తన సెల్‌ఫోన్‌ను కొండపోచమ్మ టెంపుల్ దగ్గర పోగొట్టుకున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు జగదేవ్‌పూర్ పోలీసులకు కేసునమోదు చేశారు. పోలీస్ సిబ్బంది జి. రమేష్ సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశాడు. ఫోన్‌ను స్వాధీనం చేసుకుని జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి సెక్షన్ ఇన్‌చార్జి హెచ్‌సీ. జనార్దన్, కానిస్టేబుల్ లింగం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రమోహన్ మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే ఫోన్, ఇతర వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

'పేదలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం'


మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

ములుగు, ఆగస్టు 10: పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించడమే తమ లక్ష్యమని కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొన్నాల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వాగునూతిలో గ్రామ పంచాయతీ వద్ద శనివారం షుగర్, బీపీ ఇతర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపాడు.

దుబ్బాకలో నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

దుబ్బాక, ఆగస్టు 10: దుబ్బాక ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో నేడు నియోజకవర్గంలోని బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పంపిణీ చేస్తారని బీఆర్ఎస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు వంశీ శనివారం తెలిపారు.